

12న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 12న నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 10 గంటలకు 2వ స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 7వ స్థాయి సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఒకటో స్థాయి, 3 గంటలకు 6వ స్థాయి, 4 గంటలకు 3వ స్థాయి, 5 గంటలకు 5వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఒకటి నుంచి టేక్ హోం రేషన్

- ఏర్పాట్లు పూర్తి కాక ఆగస్టుకు వాయిదా
- బాలింతలు, గర్భిణులకు ఇళ్లకే సరుకులు
- జిల్లాలో 25,504 మంది లబ్ధిదారులు
- ప్రత్యేక సంచుల్లో అందజేత

గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ (టిహెచ్ఆర్) అమలు చేయాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు వారు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి చిన్నారులతోపాటు భోజనం చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వండిన ఆహార పదార్థాలకు బదులుగా సరుకులనే అందించాలని ఆ శాఖ నిర్ణయించింది. సరుకుల పంపిణీ ప్రక్రియకు ఈ నెల నుంచే శ్రీకారం చుట్టాలని భావించింది. సరుకులను ప్రత్యేక సంచుల్లో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం, అవి సకాలంలో తయారు కాకపోవడంతో ఆగస్టుకు వాయిదా వేసింది. జిల్లాకు అవసరమైన సంచులను అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఓ కాంట్రాక్టు సంస్థకు అప్పగించింది. కేంద్రాల వారీగా ఎంత మంది లబ్ధిదారులున్నారో అందుకనుగుణంగా సంచుల్లో రేషన్ ఇచ్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.


బాలింతలు, గర్భిణులకు గుడ్లు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 15 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,759 మెయిన్, 599 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 60,029 మంది, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 36,990 మంది ఉన్నారు. 12,229 మంది గర్భిణులు, 13,275 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పదార్థాలను వండి పెడుతున్నారు. వచ్చే నెల ఒకటి నుంచి అమలు చేయనున్న 'టేక్ హోం రేషన్'లో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఇళ్లకే సరుకులను అందించనున్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కింద ప్రస్తుతం గర్భిణులు, బాలింతలకు సెంటర్లలో ప్రతి రోజూ 125 గ్రాముల రైస్, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల మంచి నూనె, ప్రతిరోజూ గుడ్డు, 250 మిల్లీలీటర్ల పాలు ఇస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో మాత్రం 100 మిల్లీలీటర్ల పాలు ఇస్తున్నారు. ఇప్పుడు వీటిని గర్భిణులు, బాలింతలు ఇంటికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వీటితోపాటు సంపూర్ణ పోషణ కింద రాగి పిండి, అటుకులు, జొన్న లేక సజ్జ పిండి కేజి చొప్పున, బెల్లం, వేరుశనగ పలుకుల చెక్కి, ఎండు ఖర్జూరం పావు కేజి చొప్పున అందించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద మల్టీ గ్రెయిన్ అట్టా రెండు కిలోలు, వేరుశనగ పలుకుల చెక్కి, రాగి పిండి, బెల్లం, ఎండు ఖర్జూరం, అరకిలో చొప్పున సంచుల్లో ఇవ్వనున్నారు.

సిఎం బొమ్మతో సంచులు!

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదయిన అర్హులైన గర్భిణులు, బాలింతలకు సరుకులను ప్రత్యేక సంచుల్లో అందజేయనున్నారు. లబ్దిదారులకు సరుకులను ఇచ్చేందుకు 26,500 సంచులు అవసరమని అధికారులు గుర్తించారు. సంచుల తయారీ బాధ్యతను జిల్లాకు సంబంధించి లక్ష్మీ గణపతి ట్రేడర్స్ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. రెండు వైపుల ముఖ్యమంత్రి చిత్రం ఉండేలా రూపొందించాలని ప్రాథమికంగా సూచించినట్లు తెలిసింది. సంచులపై వైసిపి రంగులను పోలి ఉంటాయని అనుకుంటున్నారు. వీటి తయారీలో ఆలస్యం కావడంతో టేక్ హోం రేషన్ మొదలు కాలేదని తెలుస్తోంది

సౌకర్యాలు కల్పించలేకేనా?

గర్భిణులు, బాలింతలకు సరుకులు ఇస్తే అనుకున్న లక్ష్యం నెరవేరదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కేంద్రాల్లోనే వండి పెట్టిస్తోంది. కరోనా కాలంలో తప్పనిసరి పరిస్థితుల్లో టేక్ హోం రేషన్ అమలు చేసింది. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తర్వాత పోషకాహార లేమి సమస్య నేపథ్యంలో వారిని కేంద్రాల్లోకి వచ్చి తినాలంటూ అధికారులతో పెద్ద ఎత్తున ప్రచారం చేయించింది. గర్భిణులు, బాలింతలకు నేరుగా వస్తువులు ఇవ్వడం వల్ల భార్యభర్తలు ఇద్దరే ఉన్న చోట వంట చేసుకోవడం వారికి కష్టంగా మారనుంది. అలాగని అత్త, మామ, ఇతర కుటుంబ సభ్యులుంటే ఇచ్చిన వస్తువులు ఎంతవరకు వీరికి ఉపయోగ పడతాయన్నది కూడా సందేహంగానే ఉంది. మరోవైపు కేంద్రాలు ఇరుకు గదుల్లో ఉండటం, గర్భిణులు కూర్చునేందుకు బెంచీలు కూడా లేకపోవడంతో వారు కేంద్రాలకు వచ్చి భోజనం చేసేందుకు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాల్సిన ప్రభుత్వం వాటిని విస్మరించి టేక్ హోం రేషన్ పేరిటే ఇళ్లకు ఇచ్చేందుకే మొగ్గుచూపింది.


భోజనం చేస్తున్న చిన్నారులు

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలసలో రూ.1.03 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పౌరుడు ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభిమతమని వెల్లడించారు. వైద్యం, విద్య, సంక్షేమం, వ్యవసాయం.. అనే నాలుగు రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసిందని, ప్రాథమిక వైద్యం ఇందులో లభిస్తుందని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోనూ మొబైల్ వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యాలను సంరక్షిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒపి పెరిగిందన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని వివరించారు. వీటి నిర్మాణానికి అవసరమైన పాలనాపరమైన అనుమతులను సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు చొరవ చూపాలని, ఒపిని పెంచాలని వైద్యులకు సూచించారు. ప్రజలందరూ వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, ప్రజారోగ్య విభాగం ఇఇ సుగుణాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి అజంతా కుమారి, సాధు చిరంజీవి, బొడ్డేపల్లి రాజు, పొడుగు శ్రీను, మామిడి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఇవిఎం గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎంల గోడౌన్‌ను కలెక్టరు శ్రీకేశ్ లాఠకర్.. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. గోడౌన్‌లో భద్రపరచిన వివి ప్యాట్‌లను తనిఖీ చేశారు. అక్కడున్న స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశ్, వైసిపి నాయకులు అంధవరపు సూరిబాబు, టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బిఎస్‌పి నాయకులు బొకర నారాయణరావు, సిపిఐ నాయకులు చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.


ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు


గృహనిర్బంధంలో ఉన్న సర్పంచ్ రవికుమార్

గోకర్ణపురం సర్పంచ్ గృహనిర్బంధం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో గోకర్ణపురం సర్పంచ్ ఎస్.రవికుమార్‌ను పోలీసులు గురువారం గృహనిర్బంధం చేశారు. ఆ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరుకావడంతో సర్పంచ్ సమస్యలపై నిలదీస్తారనే భయంతో పాతపట్నం సిఐ వినోద్‌బాబు ఆధ్వర్యాన మెళియాపుట్టి, పాతపట్నం ఎస్ఐలు ఆయన్ను ముందస్తుగా నిర్బంధించారు. తహశీల్దార్ పి.సరోజినీ గృహనిర్బంధంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయనను ఎమ్మెల్యే సమావేశంలో కూర్చోబెట్టారు తప్ప మాట్లాడనివ్వలేదు. అయినా గ్రామస్తులు ఎమ్మెల్యేను సమస్యలపై నిలదీశారు. వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. ఎస్‌సి వీధికి తాగునీటి సదుపాయం లేదని గ్రామస్తులు తెలిపారు. రవికుమార్ అధికార పార్టీ సర్పంచ్ అయినా, సమస్యలపై నిలదీస్తారనే భయంతో గృహనిర్బంధం విధించడం అంతటా చర్చనీయాంశమైంది.

గొప్పిలిలో అమ్మఒడి.. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజినీ, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎపిఎం లలిత, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, బి.ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి పాల్గొన్నారు.

సురక్షతో సత్వర పరిష్కారం

మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించుకునేందుకు జగనన్న సురక్ష ఎంతగానో దోహదపడుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. గురువారం శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని ఎస్ఎస్‌వలస, తండ్యాంవలస, గార మండలం అంపోలు, శ్రీకాకుళం నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి సురక్ష కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం పేరిట ప్రస్తుతం విపక్షాలు కొత్త ఆశలు చూపిస్తున్నాయన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ పథకాలను ప్రజలకు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు.

వంశధార ప్రాజెక్టు ఫేజ్ - 2 పనులు పూర్తి చేసి, వచ్చే ఏడాది నుంచి మేలో నీరు అందిస్తామని చెప్పారు. 19 టిఎంసిల నీరు నింపడానికి రూ.185 కోట్లతో హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉద్దానానికి సైతం వంశధార నీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు వరికి బదులుగా వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపి అంబటి నిర్మల, గోండు రఘురాం, ఎఎంసి ఛైర్మన్ మూకళ్ల తాతబాబు, చిట్టి జనార్ధనరావు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ గోండు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్ : ఉపాధి హామీలో భాగంగా నాటుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. గురువారం గార మండలం రామచంద్రాపురం పంచాయతీలో బ్లాక్ ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. చెరువు, కాలువ, పొలం గట్లపై మొక్కల పెంపకం వల్ల అదనపు ఫల సాయం రావడంతోపాటు పచ్చదనం పెరిగి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందరికీ అందుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం చేపట్టడం ద్వారా బాటసారులకు అవసరమైన నీడ ఉంటుందన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, త్వరితగతిన ప్లాంటేషన్ పనులు పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. మునగ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చీని బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ వంటి వాణిజ్య పంటలు సాగు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సంధ్యారాణి, ఇసి నార నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలే క్రమశిక్షణకు నాంది

- ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్
- వుషూ రాష్ట్ర స్థాయి పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పోలాకి

క్రీడలే క్రమశిక్షణకు నాంది పలుకుతాయని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. వుషూ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాలో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించే పదో సబ్ జూనియర్, తొమ్మిదో జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి వుషూ పోటీల వాల్‌పోస్టర్‌ను గురువారం మబుగాంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. విజేతలకు ఇచ్చే ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, మనోస్థైర్యం లభిస్తాయని, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం చేస్తున్న వసతుల ఏర్పాట్లపై ఆయన ఆరాతీశారు. క్రీడాకారులకు అసౌకర్యం లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. గార మండలం ఒప్పంగిలో ఉన్న ఇటిఎస్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర స్థాయి వుషూ క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వుషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ వివరించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, వుషూ సీనియర్ శిక్షకులు కురిటి తారకరామ, కొమర మోహనకృష్ణ, బైరి ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.


వుషూ రాష్ట్ర స్థాయి పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, అసోసియేషన్ సభ్యులు

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి

డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి-టెక్కలి

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని డిఇఒ తిరుమల చైతన్య సూచించారు. మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాల్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి భవనాలు వినియోగంలోకి తేవాలని ఇంజినీరింగ్ అధికారి కుప్పిలి గణేష్‌కు సూచించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతుల నిర్వహణలో నల్లబల్ల కొరతగా ఉందని గమనించిన డిఇఒ.. తానే గ్రీన్‌బోర్డును కొనుగోలు చేసి, వితరణ చేశారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ భారతి, ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణీకుమారి, ఉపాధ్యాయులు రోణంకి గౌరీప్రసాద్, పొందర అప్పారావు, వాసుదేవరావు, నరేష్, కోదండరావు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

'అగ్రిగోల్డ్' ఉద్యమం ఉధృతం

పోరాటంలో బాధితులు క్షేత్రస్థాయిలో భాగస్వాములు కావాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమం ఉధృతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్‌విడి ఫంక్షన్ హాల్లో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు సనపల నరసింహులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు అగ్రిగోల్డ్ సమస్యపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించామన్నారు. ఆగస్టు చివరికల్లా రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడాలని, ఇదే చిట్టచివరిది కావాలని తెలిపారు. అగ్రిగోల్డ్ సంస్థలో ఎందరో పెట్టుబడులు పెట్టారని, నష్టపోయిన వారంతా పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ గతంలో అగ్రిగోల్డ్ యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని, ఈలోగా ప్రభుత్వం మారడం వల్ల బాధితులకు తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యం వల్ల ఎందరో ఏజెంట్లు, బాధితులు రోడ్డున పడ్డారన్నారు. అగ్రిగోల్డ్ వ్యవహారం కోర్టులో తేలేది కాదని, ఇది కేవలం ప్రభుత్వాల వల్లే సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. అగ్రిగోల్డ్ సంస్థకు వేల కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ధ్వజమెత్తారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ వ్యక్తిగత, కుటుంబ అవసరాలకు దాచుకున్న మొత్తాలతో అగ్రిగోల్డ్ యాజమాన్యం సొంత ప్రయోజనాల కోసం ఆస్తులు కూడబెట్టుకుందన్నారు. బాధితులు తమకు జరిగిన నష్టాన్ని పూడ్చాలంటూ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి పాలకులు అండగా నిలుస్తూ బాధితులకు తీరని నష్టం చేకూర్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.నాయుడు, జయసింహా మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు సిఎం జగన్ ఇచ్చిన మాట తప్పారన్నారు. అడగని వారికి బటన్ నొక్కి డబ్బులు అందిస్తున్న సిఎం జగన్.. ఎన్నో ఏళ్లుగా ప్రధాన సమస్యగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు బటన్లను నొక్కి ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి గోవిందరావు, సిపిఐ టౌన్ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, ఎఐటియుసి గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, మేధావుల ఫోరం రాష్ట్ర నాయకులు నర్సునాయుడు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు బి.శ్రీను, టిడిపి జిల్లా నాయకులు సింతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు

సమగ్ర భూపంపిణీ చేయాలి

వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో సమగ్ర భూపంపిణీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 వేల ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తామని చెప్పడాన్ని స్వాగతించారు. కోనేరు రంగారావు కమిటీ నివేదిక ప్రకారం సుమారు 30 లక్షల ఎకరాల ప్రభుత్వ మిగులు భూములు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా మొక్కుబడి భూపంపిణీకి సిద్ధపడుతోందని చెప్పారు. సమగ్ర భూపంపిణీకి కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పేదలను సమీకరించి సమగ్ర భూపంపిణీ చేసే వరకూ ఉద్యమిస్తామన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా బడ్జెట్ కేటాయింపుల్లో ఏటా కోతలు విధిస్తున్నారని విమర్శించారు. భూమి, ఉపాధి హామీ రక్షణకు ఐక్యపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వంశధార నిర్వాసితుల సమస్యలు తీవ్రంగా ఉన్నా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో వ్యకాస రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, డి.వెంకన్న. శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్. ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం, జిల్లా నాయకులు జి.ఈశ్వరమ్మ, కె.ఎల్లయ్య, డి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీతులసి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీతులసి

ప్రజాశక్తి - జలుమూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీతులసి ఆదేశించారు. మండలంలోని గురువారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పిహెచ్‌సిలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల తీరు తెన్నులను, సిబ్బంది పనితీరును వైద్యాధికారి గురునాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అల్లాడలో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేను పరిశీలించారు. సర్వే తీరు, గోడలపై మార్కింగ్ చేయు విధానాలపై వైద్యాధికారి వైద్యం, ఆశా కార్యకర్తలను ప్రశ్నించారు. ప్రతి ఆశ కార్యకర్త కనీసం 10 అనుమానిత కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానిత కేసులను సస్పెక్టెడ్ కేసు రిజిస్టర్‌లో పొందుపరచాలని సూచించారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుబ్రహ్మణ్యపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. రోగులకు అందుతున్న సేవలపై డాక్టర్ వంశీకృష్ణతో సమీక్షించారు. రోగులకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈమెతో పాటు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, ఇఒ సిమ్మ సోమేశ్వరరావు ఉన్నారు.



కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

ఆమదాలవలస : న్యాయవాదుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన న్యాయవాదుల కుటుంబానికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు మార్కండేశ్వరరావు, ధనుంజయరావు, రమణ, రాజేశ్వరరావు, హరీష్, డోల రమణ, కూన గణపతి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కోరారు. మున్సిపాలిటీలోని బెల్లువద కాలనీ-1 సచివాలయం పరిధి 4, 23 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎస్‌సి హాస్టల్ వద్ద నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, తహశీల్దార్ గురుప్రసాద్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, కౌన్సిలర్ ఇరాన్ ప్రదీప్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్, కౌన్సిలర్ ప్రతినిధి నీలాపు ఢిల్లీ, ప్రకాష్ పట్నాయక్ పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని గూడెం, పెద్దసాన పంచాయతీల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పాల్గొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హనుమంతు వెంకటరమణమూర్తి, తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, దువ్వాడ హైందవి, సమపతరావు రాఘవరావు, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, రౌతు జయరాం, దల్లి లోకేశ్వరరెడ్డి, కె.కామేశ్వరరావు, మెర్రి శంకరరావు, బగాది హరి, బెండి గిరి, బుసకల శ్రీనివాస్, ఆట్లరవి పాల్గొన్నారు.



టెక్కలి : ధ్రువపత్రాలను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

జలుమూరు: మండలంలోని రాణ, లింగాలవలస సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, వైసిపి నాయకులు ధర్మాన జగన్మోహనరావు, పైడి విఠల్‌రావు పాల్గొన్నారు.

జీడి మద్దతు ధరపై రాజకీయాలు చేయొద్దు

వజ్రపుకొత్తూరు: ఉద్దానం జీడి రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయం చేయాలని గౌతు కుటుంబం చూస్తుందని, జీడి మద్దతు ధరపై రాజకీయాలు మానుకోవాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం చినవంకలో తహశీల్దార్ బి.అప్పలస్వామి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాటాల్డఆరు. ఉద్దానం జీడి రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉన్నది మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాత్రమే అన్నారు. చిత్తశుద్ధి ఉన్నందునే రెండు పర్యాయాలు జీడి రైతులు, వ్యాపారులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గౌతు శిరీష్ తన ఎమ్మెల్యే పదవీ కాలంలో జీడి రైతుల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం కౌలు రైతులకు 11 నెలల కాల పరిమితి తో కూడిన హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తిరుమలరావు, సచివాలయ కో-ఆర్డినేటర్ వడ్డి కరుణాకర్, సచివాలయ కన్వీనర్ జగాది శ్రీకాంత్, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇరోతు హేమంతరావు, ఉప సర్పంచ్ రెయ్యి శ్రీనివాస్, సాధికారత కమిటీ అధ్యక్షుడు పైల కేశవరావు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, కొయిరి డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని శైలజ కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, పి.కమేష్, నర్త జోగారావు, బి.ధర్మారావు, మల్ల వెంకటరమణ, టి.శ్రీకృష్ణ, సోమేష్ పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఉదయకుమార్

రేపు జాబ్‌మేళా

జలుమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 8న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, మండలంలోని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి వాన గోపి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎపి ఎస్ఎస్‌డిసి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, ఏదైనా డిగ్రీ, బిటెక్ చదివిన వారు అర్హులన్నారు. సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు రక్తదాన శిబిరం

ఆమదాలవలస : ఈ నెల 8న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి (రైతు దినోత్సవం) సందర్భంగా పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

పలాస : ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పలాస నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రశ్నించారు. పలాస ప్రగతి భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గానికి ఏదో చేసేశామని ప్రగల్భాలు పలికే మీరు.. ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల ఎంపీగా ఎన్నికై ప్రజలకు పనికొచ్చే పని చేశారా? ప్రశ్నించారు. పలాస రైల్వేస్టేషన్‌లో బెంచీలు వేయించడం తప్ప శాశ్వతమైన ఒక్క పని ప్రజలకు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. జిల్లా ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయింపులు ఏ నియోజకవర్గానికి ఇచ్చారో చెప్పాలన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడి మందస మండలం కమలాపురానికి రోడ్డు తీసుకొచ్చారని తెలిపారు. నర్సీపురానికి రైల్వే బ్రిడ్జి పునరుద్ధరణ పనులు కోసం రైల్వే డిఆర్ఎంతో మాట్లాడడానికి ఓ సాధన కమిటీని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రతి చిన్న విషయంలోనూ ఎంపీ తలదూర్చి ఏదో చేయాలని అనుకుంటున్నారన్నారు. ఎంత మంది ఏకమైనా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఏమి చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ప్రజలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తే తీవ్రస్థాయిలో టిడిపి నాయకులకు బుద్ధి చెపుతామని హెచ్చరించారు. సమావేశంలో సమావేశంలో దుర్గా శంకర్ పండా, గుజ్జు జోగారావు, శిష్టి గోపి తదితరులు పాల్గొన్నారు.



స్వీట్ తినిపిస్తున్న 'ఎన్ఇఆర్'

పురందేశ్వరికి అభినందనల వెల్లువ

రణస్థలం రూరల్: బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన దగ్గుబాటి పురందేశ్వరికి నాలుగు మండలాల బిజెపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ మేరకు బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) ఆధ్వర్యాన బిజెపి క్యాంప్ కార్యాలయంలో గురువారం అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగురవేయడమే ధ్యేయంగా కలిసి కట్టుగా పనిచేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు.

8న రాజాంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిబిఆర్ ఫౌండేషన్ (బాపట్ల) ఆధ్వర్యాన కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు, కళావంత్ ఫౌండేషన్, శ్రీచౌడేశ్వరి దేవాంగ యువజన సంఘం సహకారంతో ఈ నెల 8న రాజాం వస్త్రపురికాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, బి.శ్రీనివాసరాజు, ఎస్ఎంసి చైర్మన్ చప్పటి పెంటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం పేషెంట్లకు దశాబ్ద కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా జిబిఆర్ ఫౌండేషన్ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న టాక్స్ పేయర్స్

కొనసాగుతున్న సంతకాల సేకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం ప్రజలపై దొడ్డిదారిన విధిస్తున్న విద్యుత్ ఛార్జీల భారంపై శ్రీకాకుళం టేక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం మూడో రోజున నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ అభిప్రాయం బేలట్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో వి.జి.కె.మూర్తి, కె.సూరయ్య, ఎం.గోవర్ధనరావు, కె.శ్రీనివాసు, ఎస్.రఘు తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు అందని నీరు

పలాస: ప్రతి ఏటా శివారు భూములకు వంశధార నీరు అందించడంలో పాలకులు విఫలమవుతున్నారని జనసేన నియోజకవర్గ నాయకులు వి.దుర్గారావు ఒక ప్రకటనలో విమర్శించారు. సొంత నియోజకవర్గంలోనే వంశధార నీరు అందించలేని స్థితిలో మంత్రి ఉన్నారని ఆక్షేపించారు. ఏనాడూ సాగునీటి కాలువను సందర్శించకుండా కాలువ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోకుండా మంత్రి మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. నరసన్నపేట నియోజకవర్గంలో అనధికార లిఫ్టులు ఏర్పాటు చేసిన ఘటన ధర్మాన సోదరులకు కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు మంత్రిగా టెక్కలి నియోజకవర్గ పరిధిలో అనధికార లిఫ్టులు కట్టినపుడు వైసిపి పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అప్పలరాజు ఎందుకు ప్రశించలేదని నిలదీశారు. ఎమ్మెల్సీ దువ్వాడ టెక్కలి మండలం దాటి నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు విడిచిపెట్టవద్దని అధికారులకు భయపెట్టిన మాట వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం కనీసం ఈ ఖరీఫ్ సీజన్‌కైనా నీరందించాలని డిమాండ్ చేశారు.

సిహెచ్‌సికి వైద్య పరికరాలు వితరణ

రణస్థలం: రణస్థలం సిహెచ్‌సికి రూ.6 లక్షలు విలువైన వైద్య పరికరాలు, ఫర్నీచర్, తదితర సామగ్రిని గురువారం యాక్సిస్ క్లినికల్ లిమిటెడ్, శ్రేయాస్ పరిశ్రమ సంయుక్తంగా వితరణ చేశాయి. వీటిని శ్రేయాస్ పరిశ్రమ జనరల్ మేనేజర్ గోపాలకృష్ణారెడ్డి.. సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావుకు అందజేశారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సూపరింటెండెంట్ తెలిపారు. పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రేయాస్, అరబిందో ఫార్మా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెప్పడం మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వెన్నతో పెట్టిన విద్యని, ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వ్యాఖ్యానించారు. గురువారం అరసవల్లిలోని తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లలో అభివృద్ధి జరగలేదని ఎవరైనా అంటే కాలర్ పట్టుకుని నిలదీయండంటూ మంత్రి ధర్మాన వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. అసలు ఏంచేశారో ప్రజలకు మీరే చెప్పాలని హితవుపలికారు. టిడిపి హయాంలో నిధులు ఇచ్చి మొదలు పెట్టిన పనులు నేటికీ ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. నగరంలోని స్టేడియం నిర్మాణం, గార వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన, గార ఎత్తిపోతల పథకం, నర్సింగ్ కాలేజి, టిడ్కో ఇళ్ల నిర్మాణం, శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేక పోయారో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ పనులన్నీ అభివృద్ధిలోకి రావా? అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ నేతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించాలని కాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభపరిణామమని అన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వంలో బాగామేనని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. జిల్లాలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రీవెన్స్‌లో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ నెల 21న ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బడగల పూర్ణచంద్రరావు, కె.జయరావు, గోవింద్ పట్నాయక్, ఆర్.వేణుగోపాల్, బి.శ్రీనివాసరావు, పైడి రవి, శశిభూషణరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాలల గ్రాంట్ల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏటా పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు, ఇతర అవసరాల నిమిత్తం పూర్తి గ్రాంట్లను విడుదల చేసే సంప్రదాయం ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పాఠశాలకు విడుదల చేయాల్సిన గ్రాంట్లను మూడు విడతలను బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ మేరకు సర్వ శిక్షా అభియాన్ ఎపిసి ఆర్.జయప్రకాష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బకాయిలను చెల్లించకుండానే కొత్త ఆర్థిక సంవత్సరంలో మూడు నెలలు గడిచిపోయిందన్నారు. ఇప్పటికీ పాత బకాయిలను చెల్లించలేదని పేర్కొన్నారు. వీటిని వెంటనే చెల్లిస్తూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్లు కూడా విడుదల చేసేందుకు తగు చర్య తీసుకోవాలని అన్నారు. దీనిపై ఎపిసి స్పందిస్తూ బకాయి గ్రాంట్లు విడుదలకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ ఉన్నారు.

జీడి పరిశ్రమలను తెరిపించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆనందరావు

ప్రజాశక్తి- పలాస

జీడి పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారని, ఆదాయం లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, తక్షణమే జీడి పరిశ్రమలను తెరిపించాలని, లేని యెడల రిలే నిరాహారదీక్షలు చేపడతామని క్యాష్యు లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎల్,మధుసూదనరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి వ్యాపారాలు లాభాల కోసం జీడి పరిశ్రమలు నెల రోజులు పాటు బంద్ ప్రకటించడం బాధాకరమన్నారు. దీని వల్ల 20 వేలు మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు చొరవ చూపి తక్షణమే జీడి పరిశ్రమలు తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో గజ్జి బాలయ్య, చొక్కర ఈశ్వరరావు, కొవిరి దేవరాజు, చంద్రశేఖర్ ఉన్నారు.

మంత్రిని విమర్శిస్తే ఊరుకోం

ప్రజాశక్తి- రణస్థలం

ఎంపీ రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష ఓర్వలేక నిత్యం పలాసలో మంత్రి డాక్టర్ అప్పలరాజుపై, మత్స్యకారులపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షులు కోనాడ నర్సింగరావు హెచ్చరించారు. మండలంలోని జీరుపాలెంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మీ కుటుంబాలే రాజకీయ వ్యవస్థను పరిపాలించాలా? వెనుకబడిన తరగతి వారు రాజకీయాలు చేయకూడదా? అని ప్రశ్నించారు. మంత్రి డాక్టర్ అప్పలరాజుని విమర్శించే ఊరుకోమని హెచ్చరించారు. మత్స్యకారులకు తెలుగు దేశం పార్టీ చేసింది శూన్యమని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి డాక్టర్ సీదిరి అప్పలరాజుకి మంత్రి పదవి ఇచ్చిందని అన్నారు. మంత్రి అప్పలరాజు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు.

సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. పలాసలో కిడ్నీ వ్యాధి గ్రస్తులకు 200 పడకలతో ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకార భరోసా రూ.4 నుంచి రూ.పది వేలుకు పెంచారని అన్నారు. డీజిల్ సబ్సిడీ గతంలో 6 శాతం ఉంటే... ఇప్పుడు 9 శాతం ఇస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న మత్స్యకారులను స్వగ్రామాలకు తీసుకొచ్చారని తెలిపారు. టిడిపి పరిపాలనలో మత్స్యకారులకు కనీస గౌరవం ఇవ్వకుండా తొక్కేస్తాం... తోలుతీస్తామని అనే పదాలు ఇంకా మాకు గుర్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం నాయకులు మూగి శ్రీరాములు, మాగుపల్లి కామరాజు, మాగుపల్లి రాముడు, బడి రాంబాబు, మూగి గురుమూర్తి, వారధి లక్ష్మణరావు, మాగుపల్లి ప్రేమ్‌కుమార్, వాసుపల్లి పోలీవాడు, మాగుపల్లి కామరాజు, రాయతి చిన్నారావు, మైలపల్లి చిన్నారావు, కొమర సతీష్, వాసుపల్లి సురేష్, రాయతి, తోటయ్య, మాగుపల్లి, అప్పలనాయుడు, సూరాడ, శ్రీను, మాగుపల్లి, యర్రయ్య, మైలపల్లి, అప్పన్న, సూరాడ, కైలాస్, మైలపల్లి, రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యకార సంఘం నాయకులు


'మండల'కు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో నివాసముంటున్న మండల కులస్తులకు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలిగాం, కీర్తిపురం, పాయితారీ గ్రామాల్లో నివాసముంటున్న ముండలకు ఎస్‌సి కేటగిరిలో చేర్పించాలన్నారు. రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసినప్పుడు తిరస్కరిస్తున్నారని అన్నారు. అందువల్ల వారి పిల్లలకు పాఠశాలల్లో సీట్లు రాకుండా నాణ్యమైన విద్యను పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలైన కాపు నేస్తం, వైఎస్ఆర్ చేయూత, ఇబిసి నేస్తం, వైఎస్ఆర్ పెళ్లికానుక వంటి వాటికి దూరమవుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కృష్ణ, నర్సింగ, అరుణ్ కుమార్, సుధీర్, శంకర్, శివ, బాలాజీ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సాయిరాజ్



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కె.కొత్తూరు పిహెచ్‌సి డాక్టర్ దుంపల ఇంద్రజ, శిష్టు గాయత్రి అన్నారు. పట్టణంలోని గురుకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలునిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ ప్రాణాపాయంతో కూడుకున్నదని, దాని లక్షణాలు తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, అలసిపోవడం, జ్వరం, వాంతులు ఐదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు వస్తాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ఉండాలంటే పరిసరాలు, ఖాళీ స్థలాల్లో, కొబ్బరి డొక్కుల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. వంటపాత్రలు నిల్వ ఉంచకుండా ఉదయం, సాయంత్రం శుభ్రం చేసుకోవాలన్నారు. పిల్లలకు వేడినీళ్లతో పాటు పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో శిష్టు గాయత్రి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

జోరుగా పేకాట శిబిరాలు

కీలకంగా వ్యవహరిస్తున్న ముఖ్య నాయకుడు!



టార్పాలిన్‌ను వదిలి వెళ్లిపోయిన జూదర్లు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి కవిటి మండలం జమేదారుపుట్టుగ సమీపంలోని కొబ్బరి తోటల్లో పేకాట శిబిరంపై ఎస్ఐ రాము అధ్యక్షతన పోలీసులు దాడి చేసి ఆరుగురుని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం ఇచ్ఛాపురంలోని సైదాఖాన్ చెరువు సమీపంలోని పొలాల్లో పేకాడుతున్నట్టు సమాచారం అందుకున్న సిఐ ఈశ్వర చంద్రప్రసాద్, ఎస్ఐ గోవిందరావు సిబ్బందితో అక్కడికి చేరుకునేసరికి జూదరులు జారుకున్నారు. అయితే ఇటీవల రాజకీయాల్లోకి వచ్చి నియోజకవర్గంలో కీలక పదవిలో ఉన్న ఓ ప్రజా ప్రతినిధికి దీనితో సంబంధం ఉన్నట్టు జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా సదరు ప్రజా ప్రతినిధి మీడియా, పోలీసుల పేరు చెప్పి జూదరుల వద్ద పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం రాత్రి కవిటి పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసినప్పుడూ సదరు ప్రజా ప్రతినిధిని హెచ్చరించినట్టు సమాచారం. మరోవైపు ఇచ్ఛాపురం, కవిటి మండలాల పరిధిలో కొబ్బరి, జీడి తోటల్లో ఈ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇచ్ఛాపురంలో జరిగిన ఓ పత్రికా సమావేశంలో పాల్గొన్న ఎస్‌పి పేకాట శిబిరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామని హెచ్చరించారు. అయినా నియోజకర్గస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించకపోగా, శిబిరాలు అధికమయ్యాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రోయిన్ పనులు పరిశీలన

ఇచ్ఛాపురం: మండలంలో బాహుదా నదిపై కొత్తగా చేపడుతున్న గ్రోయిన్ నిర్మాణ పనులను గురువారం నీటి పారుదల శాఖ డిఇఇ జి.వి.రమణ పరిశీలించారు. సాగునీటి కోసం సుమారు రూ.28 లక్షలతో గ్రోయిన్ నిర్మిస్తున్నారు. చిన్న చిన్న పనులు కూడా పూర్తి చెయ్యాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ ఎంఎస్. పాణిగ్రాహి, వర్క్ ఇన్స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- పలాస

వార్డులో తాగునీటి సమస్య తలెత్తడంతో కుళాయిలు వేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు న్యూ కాలనీ ఫిష్ మార్కెట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి పైప్‌లైన్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో పర్యటిస్తున్న సమయంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానిక మహిళలు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. దీంతో కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- కవిటి

కవిటి బస్ స్టాండ్, బజారు వీధి, పరిసర ప్రాంతాల్లో గురువారం ఎస్ఐ రాము గురువారం వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్ లేని పలువురు వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ, విడిచిపెట్టే సమయాల్లో పోకిరీ యువకులు సంచరిస్తున్నట్టు తెలిసిందని, ఇకపై అటువంటి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం జాతీయ రహదారి కూడలిలో మాజీ ఎంపీ బడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ గురువెళ్లి కేశవరావు గురువారం భూమి పూజ చేశారు. రాజగోపాలరావు వంశధార కాలువ తీసుకురావడం వల్ల మా పంచాయతీలో రైతులు రెండు పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. అలాంటి నాయకుడి విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో అనందంగా ఉందని తెలిపారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు ఉద్యోగులు, పరిసర ప్రాంత కులపెద్దలు, గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హరిశ్చంద్రపురం ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది దివాకర్ మాజీ సర్పంచ్ దుప్పల నర్సింహమూర్తి, బల్లి కామరాజు, గురువెళ్లి కన్నయ్య, హనుమంతు తేజేశ్వరరావు, హనుమంతు అప్పలరాజు, ఉప్పాడ పూర్ణరావు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పొందూరు

గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి మల్లేశ్వరమ్మ అన్నారు. మండలంలోని కనిమెట్టలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వర్షాకాలం కారణంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి సుభాషిని, ఎఎన్ఎం లీలా కుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి గ్రామంలో పలు కుటుంబాలను తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ గురువారం పరామర్శించారు. కొంతకాలం కిందట మృతి చెందిన యరుసు అమ్మాయమ్మ, సన్నబాబు కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. నడసంద్ర, పట్టుపురం సర్పంచులు మామిడి శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచులు పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్, జనపరెడ్డి కన్నబాబు, ఉర్లాన రవికుమార్, ఎస్.గౌరీష్, ఎస్.లక్ష్మి, సంతోష్, రవీంద్ర జన్న, వెంకటరావు, జగన్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ గణపతి లాడ్జి వెనుక భాగంలో విద్యుత్ సమస్యతో బాధపడుతుండడంతో సమస్యను పరిష్కరించామని వార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. వార్డు ప్రజలు విద్యుత్ సమస్యపై తన దృష్టికి తీసుకురావడంతో విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటుచేశామని చెప్పారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

వార్డుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 12, 28 వార్డులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయా వార్డు కౌన్సిలర్ల ప్రతినిధులు పోతనపల్లి హరి, బోనేల రాము అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డు దళిత వీధిలో మురుగు కాలువల్లో పూడికతీత, 28 వార్డులో పారిశుధ్యం పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రానున్న కాలం వర్షాకాలం కావడంతో జ్వరాలు రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు.

వృక్ష సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- నౌపడ

వృక్ష సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాభవాని కొబ్బరి మొక్కను నాటారు. వృక్ష సంరక్షణ బాధ్యతను తెలియజేశారు. మానవాళి మనుగడకు అవసరమైన ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్నతుంగాం సర్పంచ్ సిమ్మ గోవిందరావు, కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, విజయ్ కుమార్, కె.బి.శ్రీరామదాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-సోంపేట

మండల పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులకు నియామకాలు చేస్తామని ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు తెలిపారు. ఈ మేరకు గురువారం పలువురు వాలంటీర్లకు నియామక పత్రాలను అందించారు. రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

నందిగాం : మండల రిసోర్స్ కేంద్ర భవనంలోని భవిత కేంద్రాన్ని సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు గురువారం సాయంత్రం సందర్శించారు. వికలాంగులు ఏడాదికి రూ.250 చెల్లిస్తే... ఆరోగ్య సేవలతో పాటు రూ.2 లక్షల మేర ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. దీనికి సదరం ధ్రువపత్రం తప్పనసరిగా ఉండాలన్నారు. ఈయన వెంట ఎంఇఒ చిన్నారావు, జి.నర్సింహులు, సహాయ సాహిత్య విద్యా కో-ఆర్డినేటర్ ఎస్.అనురాధ, ఐడి ఉపాధ్యాయులు పి.రాణి ఉన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్



కోటబొమ్మాళి : కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

ప్రజాశక్తి- నరసన్నపేట

జూనోటిక్ వ్యాధులు మానవ జనాభాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి ప్రభుత్వాలు మెరుగైన చర్యలు తీసుకోవాలని జునోసిస్ పరిశోధనకర్త సుసరాపు సతీష్ కోరారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనోసెస్ దినోత్సవం ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ పనిని గుర్తుచేస్తుందని అన్నారు. జూనోటిక్ వ్యాధి అయిన రాబిస్‌కు వ్యతిరేకంగా పాశ్చర్ మొదటి టీకాను విజయవంతంగా అందించాడని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.మేరీరత్నం, జువాలజీ అధ్యాపకులు ఎం.బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.

పలాస : ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా ఎడి కార్యాలయంలో 52 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను పశుసంవర్ధకశాఖ ఎడి పోతనపల్లి చంద్రశేఖర్ వేశారు. అనంతరం జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మొబైల్ వ్యాన్ వైద్యులు డాక్టర్ భానుమతి, డాక్టర్ సంతోషి, ఎల్ఎస్ఎ కళ్యాణ్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : జూనోసిస్ దినోత్సవ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత రాబిస్ వాక్సినేషన్ వేసినట్లు పశుసంవర్ధకశాఖ ఎడి జి.రఘునాథ్ తెలిపారు. టెక్కలి చిన్నబజార్ పశువుల ఆస్పత్రి వద్ద 132 పెంపుడు కుక్కలను వ్యాక్సినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. ఈయనతో పాటు అసిస్టెంట్ ఎన్.వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

కోటబొమ్మాళి: జూనోసిస్ దినోత్సవ సందర్భంగా 63 పెంపుడు కుక్కలకు ఉచిత రాబిస్ వ్యాక్సినేషన్‌ను సహాయ సంచాయకులు డాక్టర్ మదా లోకనాథంలు వేశారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు, ఎంపిడిఒ



పలాస : కుక్కలకు టీకాలు వేస్తున్న చంద్రశేఖర్

కె.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ జోనోసిస్ దినోత్సవం అంటే జంతువుల నుంచి మనుషులకు, అలాగే మనుషులు నుంచి జంతువులకు సోకే వ్యాధుల నివారణ చర్యలు, టీకాలు వేయడమని, పాణాంతక వ్యాధులైన ర్యాబీస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కొత్తమ్మ తల్లి ఆలయ చైర్మన్ బోయిన మాధవి కృష్ణారావు, కలింగ కార్పొరేషన్ చైర్మన్ సంపతిరావు హేమసుందర్‌రావు, గంగారం సర్పంచ్ పేడాడ వెంకటరావు, పశువైద్యాధికారులు నారాయణమూర్తి, కిరణ్‌కుమార్, వెంకటేష్, ప్రజ్ఞ చైతన్య, మైత్రి పాల్గొన్నారు.



చంద్రబాబును సన్మానిస్తున్న గోవిందరాజులు

చంద్రబాబును కలిసిన గోవిందరాజులు

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబును కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితిని గోవిందరాజులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అలాగే బోయిన గోవిందరాజులు పార్టీకి చేస్తున్న సేవలను అభినందించారు.

సంఘ సంస్కర్త జగ్జీవన్‌రాం



ఇచ్ఛాపురం.. జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రాం 41వ వర్ధంతి నగరంలోని అరసవల్లి జంక్షన్‌లో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రానా శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు దాసరి తిరుమలరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్జీవన్‌రాం నాలుగు దశాబ్ధాల పాటు పార్లమెంట్ సభ్యునిగా, భారత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షునిగా సేవలందించారన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవుల్లో కొనసాగిన ఆయన అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో లోపింటి దామోదర్, ఎంఆర్‌పిఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ రాడ రఘు, నాయకులు నత్తల రవి, లోపింటి కోటి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైసిపి నాయకులు కె.మోహనరావు, దుక్క లోకేశ్వరరావు, నూకయ్యరెడ్డి, ఆనంద్, ఉప్పాడ రాజారెడ్డి, ఇఒపిఆర్‌డి రామారావు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ సంత మైదానంలో బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఉర్లాన అప్పలరాజు, బొర ప్రకేష్, మీల జోగారావు, లండ చంద్రయ్య, చెరుకుపల్లి నేతాజీ, తెప్ప పాపారావు, మీల ప్రసాద్, సోద భీమరాజు, కుమార్, జల్సా కిషోర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా పలాస

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా నిర్మిద్దామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పారిశుధ్య సమస్యకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్లాస్టిక్‌తో కాలువలు నిండిపోతున్నాయని, వాటిని శుభ్రపరచడానికి లక్షలాధి రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవదని, దీనిని తినడం వల్ల ఎన్నో మూగజీవాలు బలయిపోతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వల్ల అనేక రకాల నష్టాలు ఉన్నాయన్నారు. వాటిని నిర్మూలించడమే తప్పని సరని భావించి వాటి విక్రయాలకు చెక్ పెట్టాలన్నారు. ముందుగా హెచ్చరికలు చేపట్టడానికే ఈ సమావేశం నిర్వహించామని చెప్పారు. మూడు రోజులు గడువు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ఇస్తున్నామని, అనంతరం విక్రయాలు చేపట్టినా, వాటిని వినియోగించినా వ్యాపారులపై జరిమానా, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జీవన విధానంలో మార్పుకు ఇదో మంచి అవకాశమని, అందుకోసం ప్లాస్టిక్ నివారించాలని అందరమూ కోరుకుందామని అన్నారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పలాసను ప్లాస్టిక్ పలాసగా పేరు పెడితేనే బాగుంటుందనిపిస్తుందన్నారు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ దర్శనమిస్తున్నాయని అన్నారు. ఎక్కడైనా తడి చెత్త ఎక్కువుగా, పొడి చెత్త తక్కువుగా దొరుకుతుందని, పలాస ప్లాస్టిక్ నిలయంగా మారి పొడి చెత్త ఎక్కువుగా రావడం విశేషమన్నారు. సాలూరు. బొబ్బిలి, పాలకొండ మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ పూర్తిగా నివారించారని అన్నారు. ఇప్పుడు కాకపోతే రేపు అయినా ఆ జాబితాలో పలాస చేరాలని అన్నారు. అప్పటికీ వ్యాపారులలో మార్పు రాకపోతే జరిమానా, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కవర్లకు బదులు గుడ్డ సంచులు వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఎల్ఎన్‌పేట

ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని స్కాట్‌పేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, ఎవరైనా ఫోన్లు చేసి అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వరాదని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేయమని కార్డును ఇవ్వరాదన్నారు.

అనంతరం డిజిటల్ పేమెంట్స్ వాటి వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్స్యూరెన్స్ పథకాలను గురించి విపులంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు 'మై టాస్'తో ఉపయోగం

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థులకు విద్యా విషయక అధ్యయనంలో మెరుగుపపరిచ్చేందుకు దేశవ్యాప్తంగా మై టాస్ అనే పరీక్ష నిర్వహిస్తున్నామని ఎడ్యు బేసిక్ సిఇఒ ఆరవెల్లి సూర్యప్రకాష్ తెలిపారు. చెన్నయ్, బెంగుళూర్, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, భువనేశ్వర్ ఎడ్యు బేసిక్ ఇనీషియే టిన్స్ సంస్థ విద్యారంగంలో పలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం లావేరులో విలేకరులతో మాట్లాడారు. త్వరలో నిర్వహించనున్న ఈ పరీక్ష వల్ల విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం, పాఠ్యాంశాలపై అవగాహన, నైపుణ్యం కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో ఇంజినీరింగ్, మెడికల్ తదితర పోటీ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు విజయం సాధించడానికి మై టాస్ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్ష మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల వల్ల ప్రాథమిక భావనలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చున్నారు. ఏటా రెండు పర్యాయాలు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

రక్తదాతలు.. స్ఫూర్తి ప్రదాతలు

ప్రజాశక్తి- కవిటి

ఆపద సమయంలో అండగా ఉంటూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి తమ రక్తం కూడా దారబోసి పలువురు



రక్తదానం చేస్తున్న కుమార్

యువకులు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి పలువురికి ప్రాణదానం చేస్తున్నారు. ఆ కోవలోనే ఇచ్ఛాపురం, సోంపేటలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మండలంలోని జగతి, సోంపేట మండలం నారాయణపురం గ్రామాలకు చెందిన మహిళలకు పర్రిపుట్టుగకు చెందిన కుమార్, సహలాలపుట్టుగకు చెందిన వెంకటేశ్ గురువారం ఓ పాజిటివ్ రక్తదానం చేసి అండగా నిలిచారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజానీకం రక్తదాతలను అభినందిస్తున్నారు.

ప్రకృతి సేద్యంలో కూరగాయల సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి సేద్యం 36 ఇంటు 36 పద్ధతిలో రైతులు కూరగాయల సాగును చేపట్టారు. ఈ సందర్భంగా మండల యాంకర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి సేద్యం పద్ధతిని ఐదు అంతస్తుల కూరగాయల సాగు అని కూడా అంటారని అన్నారు. ఈ పద్ధతిలో నిర్దిష్టమైన కొలతలను తీసుకొని మొక్కకు మొక్కకు మధ్యలో ఆరు అడుగులకు ఒకటి చొప్పున బెడ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. బెడ్‌కి ఒక రకం చొప్పున మొత్తం ఐదు బెడ్స్‌లో వివిధ రకాలైన ఆకుకూరలు, కాయగూరలు, తీగజాతి రకాలు, చిన్న పళ్ల జాతి మొక్కలను వేసుకోవాలని అన్నారు. అన్ని రకాల పోషక విలువలతో కూడిన కూరగాయలు ఒకే దగ్గర లభ్యమవుతాయని అన్నారు. దీని వల్ల కుటుంబానికి అవసరమైన కాయగూరలతో పాటు అదనపు ఆదాయాన్ని కూడా సంపాదించవచ్చునన్నారు.

ఈ రకం పద్ధతిలో సాగు చేసిన కాయగూరలు నాణ్యంగా ఉంటాయని వివరించారు. ప్రకృతి సేద్యంలో మోడల్స్ సాగు అలాగే పెరటి తోట విధానంలో కాయగూరలు పండించుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు బహిరంగ మార్కెట్లో కూరగాయలు కొనే వ్యయాన్నీ తగ్గించుకోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ పద్ధతిలో అంతర పంటలు

ప్రజాశక్తి- రణస్థలం

మోడల్ పద్ధతిలో అంతర పంటలు వేయించడం వల్ల 365 రోజులు ఒక కుటుంబానికి సరిపడా పౌష్టికాహారంతో కూడిన కూరగాయలు లభిస్తాయని మోడల్ మేకర్స్ జి.రాంబాబు రైతులకు సూచించారు. మండలంలోని కొండములగాం పంచాయతీ ముక్తుంపురంలో దుక్క అప్పలస్వామి రైతు పొలంలో మోడల్ పద్ధతిలో అంతర పంటలను గురువారం వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పద్ధతిలో వేయడం వలల భూసారం, సూక్ష్మజీవుల వైవిధ్యం పెరుగుతుందని అన్నారు. రసాయని ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సులభంగా చేయవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.సత్యనారాయణ, రాజు, సత్యవతి, సునీత, దుర్గ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణమే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసు, శ్రీనివాసరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న ఉద్యోగాన్ని భర్తీ చేస్తానని, నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని హామీనిచ్చారని గుర్తు చేశారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి 55 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 పోస్టులను పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులతో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలన్నారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసులో నిరుద్యోగుల పేర్లు నమోదు ప్రారంభించి నెలకు రూ.పది వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కర్ణ వీరుడు, రాము, ఆమోస్, అప్పారావు, నూకరాజు, రాజు, మల్లేష్, విజయ్ పాల్గొన్నారు.

నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు పెట్టాలి

ప్రజాశక్తి- పలాస

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల ఫీజుల వివరాలను ఆయా పాఠశాలల నోటీస్ బోర్డులో పెట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఉపాధ్యక్షులు ఎం.వినోద్ డిమాండ్ చేశారు. పలాస పిడిఎస్‌యు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఎటువంటి పుస్తకాలు, దుస్తులు విక్రయించరాదని నిబంధనలు ఉన్నా... జిల్లాలో పలు కార్పొరేట్ విద్యా సంస్థలు పాఠశాలలోనే వేలాది రూపాయలకు పుస్తకాలను విక్రయిస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు రవి, విజయ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

చీపుర్లపాడులో గ్రామసభ

ప్రజాశక్తి-కోటబొమ్మాళి

ఉపాధి హామీ ద్వారా పనులు చేస్తున్న కూలీలకు సమస్యలు ఉంటే గ్రామసభల ద్వారా వాటిని పరిష్కరించుకోవాలని ఉపాధి హామీ ఎస్ఆర్‌పి మన్మథరావు అన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా గురువారం చీపుర్లపాడు పంచాయతీలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బొడ్డు అప్పన్న ఆధ్వర్యాన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పనిచేసి కనీస కూలి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, పిఆర్‌పి శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

హోటల్ దగ్ధం

ప్రజాశక్తి-మెళియాపుట్టి

మెళియాపుట్టిలోని పర్లాకిమిడి రోడ్డులోని ఎస్.రవికి సంబంధించిన హోటల్ గురువారం దగ్ధమైంది. ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఫ్రిజ్, సిసి పుటేజీ, తదితర సామగ్రి దగ్ధమైంది. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.